సాక్షి
కర్నూలు

ఆదివారం । 18 । మే । 2025



మహానందిలో భక్తుల సందడి

మహానంది: క్షేత్రానికి శనివారం వేలాది మంది భక్తులు వచ్చారు. కోనేరుల్లో పుణ్యస్నానాలు ఆచరించి స్వామిని దర్శించుకున్నారు.



మహిమాన్విత మూర్తి

ప్రజలకు మహిమలు చూపిన మాతృమూర్తి మహాయోగి లక్ష్మమ్మ అవ్వ జాతర ఆదోని పట్టణంలో సోమవారం నిర్వహించనున్నారు. 8లో▸



'విశ్వ'మంత సంబరం

అనంతపురం జవహర్‌లాల్ నెహ్రూ విశ్వవిద్యాలయ స్నాతకోత్సవాన్ని శనివారం నిర్వహించారు. గవర్నర్ అబ్దుల్ నజీర్ హాజరయ్యారు. 8లో▸

న్యూస్‌రీల్

జేఈఈ అడ్వాన్స్‌డ్ పరీక్షకు రెండు కేంద్రాలు

కర్నూలు సిటీ: దేశంలోని ప్రతిష్టాత్మకమైన ఐఐటీల్లో ప్రవేశాలకు జేఈఈ అడ్వాన్స్‌డ్ పరీక్ష నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్టీఏ) ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించనున్నారు. ఉమ్మడి కర్నూలు జిల్లాలో రెండు పరీక్ష కేంద్రాలను ఎంపిక చేశారు. కర్నూలు సనత్‌నగర్‌లోని అయాన్ డిజిటల్, జి.పుల్లారెడ్డి ఇంజినీరింగ్ కాలేజీలో పరీక్ష నిర్వహించనున్నారు. సుమారు 700 మంది పరీక్షకు హాజరుకానున్నారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పేపర్-1, మధ్యాహ్నం 2:30 నుంచి సాయంత్రం 5:30 గంటల వరకు పేపర్-2 పరీక్ష నిర్వహించనున్నారు. పరీక్షకు గంట ముందుగానే కేంద్రాల్లోకి అనుమతిస్తారు. అడ్వాన్స్‌డ్ పరీక్షలో ఉత్తీర్ణులైన వారు బీఆర్క్ కోర్సుల్లో చేరాలనుకుంటే ఆర్కిటెక్చర్ ఆప్టిట్యూడ్ టెస్టు(ఏఏటీ)రాయల్సి ఉంటుంది. ఈ పరీక్ష వచ్చే నెల 5న నిర్వహించనున్నారు.

ఇద్దరు విద్యార్థులు డిబార్

కర్నూలు కల్చరల్: రాయలసీమ విశ్వవిద్యాలయం పరిధిలో నిర్వహిస్తున్న డిగ్రీ, బీఈడీ సెమిస్టర్ పరీక్షల్లో శనివారం ఇద్దరు విద్యార్థులు డిబార్ అయ్యారని వర్సిటీ కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్లు తెలిపారు. ఆలూరు శ్రీ వెంకటేశ్వర డిగ్రీ కళాశాల కేంద్రంలో ఒకరు, కర్నూలు డిగ్రీ కళాశాల కేంద్రంలో ఒకరు చూచిరాతకు పాల్పడగా డిబార్ చేసినట్లు పేర్కొన్నారు.

అమెరికాలో కర్నూలు విద్యార్థి మృతి

కర్నూలు: అమెరికాలో జరిగిన రోడ్డు ప్రమాదంలో కర్నూలు విద్యార్థి ఇస్కాల వెంకట కౌశిల్ (26) మృతి చెందాడు. కర్నూలు నగరం వెంకటరమణ కాలనీకి చెందిన ఇస్కాల రవికుమార్ కుమారుడు ఇస్కాల వెంకట కౌశిల్ అమెరికాలోని టెక్సాస్‌లోని బ్యూమౌంట్ ఉంటున్నారు. లామర్ విశ్వవిద్యాలయంలో చదువుతున్నాడు. టెక్సాస్‌లో కారు నడుపుతూ ఈనెల 12వ తేదీన రాత్రి రోడ్డు ప్రమాదంలో మృతిచెందాడు. శనివారం రాత్రి మృతదేహం కర్నూలుకు చేరింది.

31న చలో సిద్ధేశ్వరం



పోస్టర్‌ను విడుదల చేస్తున్న దృశ్యం

కర్నూలు సిటీ: చలో సిద్ధేశ్వరం కార్యక్రమాన్ని ఈ నెల 31న నిర్వహిస్తున్నట్లు రాయలసీమ సాగు నీటి సాధన సమితి అధ్యక్షులు బొజ్జా దశరథ రామిరెడ్డి తెలిపారు. సిద్ధేశ్వరం అలుగు ప్రజా శంకుస్థాపన 9వ వార్షికోత్సవ సందర్భంగా ఈ కార్యక్రమాన్ని చేపట్టామని చెప్పారు. అదే రోజు సిద్ధేశ్వరం వద్ద ప్రజా బహిరంగ సభ ఉంటుందని తెలిపారు. కర్నూలులోని ఓ హోటల్‌లో క్రెడాయ్ మాజీ అధ్యక్షుడు వెంకటేర్రెడ్డి ఆధ్వర్యంలో శనివారం చలో సిద్ధేశ్వరం వాల్ పోస్టర్లను విడుదల చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికైనా మత్తునిద్ర వదిలి రాయలసీమలోని పెండింగ్ ప్రాజెక్టులను పూర్తి చేయాలన్నారు. కృష్ణా యాజమాన్య బోర్డు కర్నూలులో ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ప్రజాస్వామ్య హక్కుల పరిరక్షణ వేదిక కన్వీనర్ రామకృష్ణారెడ్డి, సీడ్ గ్రోయర్స్ అసోసియేషన్ మాజీ కార్యదర్శి మోక్షేశ్వరరెడ్డి, రాయలసీమ సాంస్కృతిక వేదిక కన్వీనర్ అప్పిరెడ్డి హరినాథరెడ్డి, సీనియర్ నాయకులు జి.చంద్రన్న, రాయలసీమ సాగు నీటి సాధన సమితి కార్యదర్శి మహేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రసాద వితరణపై పర్యవేక్షణ

శ్రీశైలం టెంపుల్: అన్న ప్రసాద వితరణపై నిరంతరం పర్యవేక్షణ చేస్తుండాలని అధికారులను ఈఓ శ్రీనివాసరావు ఆదేశించారు. శనివారం రాత్రి అన్నప్రసాద వితరణ కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఈఓ సంబంధిత అధికారులతో మాట్లాడుతూ అన్నప్రసాద వితరణకు సమయపాలనను పాటించాలన్నారు.

కరుణలేని బ్యాంకులు!

అసలు, వడ్డీ చెల్లిస్తేనే కొత్తగా పంట రుణం

- గత ఏడాది కలసిరాని వ్యవసాయం
- అప్పుల్లో కూరుకుపోయిన రైతులు
- బ్యాంకుల తీరుతో దిక్కుతోచని స్థితి
- వడ్డీకి ఇస్తామని తిష్టవేసిన దళారీలు
- ఇంటెన్సివ్ ఉన్నా వడ్డీ వసూలు
- రైతు సంక్షేమాన్ని విస్మరించిన ప్రభుత్వం



పంట రుణాల కోసం వెల్దుర్తి యూనియన్ బ్యాంక్‌కు తరలి వచ్చిన రైతులు

కర్నూలు(అగ్రికల్చర్): 2024-25 సంవత్సరంలో వ్యవసాయం కలసిరాక రైతులు తీవ్ర ఇబ్బందుల్లో ఉన్నారు. తాజాగా ఖరీఫ్ సీజన్ ముంచుకొస్తోంది. మరో 15 రోజుల్లో సీజన్ ప్రారంభం కానుంది. పంట రుణాల కోసం రైతులు బ్యాంకుల చుట్టూ ప్రదక్షిణ చేస్తున్నారు. అయితే బ్యాంకర్లు కనీస సానుభూతి చూపడం లేదనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. కష్టాల్లో ఉన్న రైతుల నుంచి వడ్డీ, అసలు బలవంతంగా వసూలు చేస్తుండటం గమనార్హం. నైరుతి రుతుపవనాలు ముందే రాష్ట్రంలోకి ప్రవేశించనున్నాయని వాతావరణ శాఖ ప్రకటిస్తోంది. ఇప్పటికే అకాల వర్షాలు అక్కడక్కడ ఒక మోస్తరుగా కురుస్తున్నాయి. రానున్న వారం, 10 రోజుల్లో మరిన్ని వానలు పడితే పత్తి, ఆముదం, కొర్ర, ఉల్లి వంటి పంటల సాగుకు అవకాశం కలుగుతుంది. ఇప్పటికే వివిధ బ్యాంకులు ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి పంట రుణాల పంపిణీని మొదలు పెట్టాయి. కేంద్ర ప్రభుత్వం ఇంటెన్సివ్ ఉన్నా అధిక వడ్డీ వసూలు చేస్తుండటం పట్ల విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఖరీఫ్ సీజన్ ముంచుకొస్తున్న తరుణంలో రైతులు పెట్టుబడుల కోసం చుక్కలు చూస్తున్నారు. 2024 ఎన్నికల సమయంలో తాము అధికారంలోకి వస్తే అన్నదాత సుఖీభవ కింద ఏడాదికి రూ.20 వేలు పెట్టుబడి సాయం అందిస్తామని కూటమి పార్టీలు ప్రకటించాయి. అయితే మొదటి ఏడాదైన 2024-25లో చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం అన్నదాత సుఖీభవకు ఎగనామం పెట్టింది. ఎన్నికల సమయంలో రైతులకు అరచేతిలో వైకుంఠం చూపిన కూటమి నేతలు ఇప్పుడు ఒక్క హామీని కూడా నెరవేర్చని పరిస్థితి.

బ్యాంకుల్లో దళారీల రాజ్యం

పంటరుణాలు, టర్మ్ లోన్‌లు, మౌళిక సదుపాయాల కల్పనకు అవసరమైన రుణాల లక్ష్యం భారీగా నిర్దేశించుకుంటున్నా ఆచరణలో సాధారణ రైతులకు రుణాలు దక్కని పరిస్థితి. కష్టాల్లోని రైతులను బ్యాంకులు ఆదుకోవాల్సి ఉన్నా ఆ దిశగా కొన్ని బ్యాంకులు ముందుకు రాకపోవడం విమర్శలకు తావిస్తోంది. పలు బ్యాంకులు దళారీలను నియమించుకొని రైతులను నష్టాలకు గురి చేస్తున్నట్లు ఫిర్యాదులు ఉన్నాయి. మండల కేంద్రాలు, గ్రామీణ ప్రాంతాల్లోని బ్యాంకుల్లో దళారీలదే పెత్తనం సాగుతోంది. ఈ పరిస్థితి దేవనకొండ, ఆస్పరి, తుగ్గలి, వెల్దుర్తి, ప్యాపిలి, డోన్, బేతంచెర్ల, సంజామల, దొర్నిపాడు, గోనెగండ్ల తదితర మండలాల్లో ఎక్కువగా కనిపిస్తోంది.

బ్యాంకుల చుట్టూ తిరగలేక రైతుల ముప్పు తిప్పలు

గతంలో తీసుకున్న పంట రుణాలను రెన్యువల్ చేసుకొని కొత్తగా పంట రుణాలు పొందేందుకు వెళ్తున్న రైతులకు బ్యాంకులు చుక్కలు చూపుతున్నాయి. ఇటీవల ఆర్బీఐ.. గతంలో తీసుకున్న పంట రుణాలు, బంగారంపై తీసుకున్న వ్యవసాయ రుణాలకు సంబంధించి అసలు, వడ్డీ చెల్లిస్తేనే కొత్త పంట రుణం పొందే విధంగా చర్యలు తీసుకుంది. దీన్ని అవకాశంగా తీసుకున్న బ్యాంకర్లు రైతులను ముప్పు తిప్పలు పెడుతున్నారు. ప్రస్తుతం 90 శాతం మంది రైతుల వద్ద చిల్లిగవ్వ లేని పరిస్థితి ఉంది. ఈ నేపథ్యంలో బ్యాంకర్లు దళారీలను కలిసే విధంగా ప్రోత్సహిస్తున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. బ్యాంకుల్లోనే తిష్టవేసిన దళారీలు రూ.2 వడ్డీతో నెల వడ్డీని మినహాయించుకొని అప్పు తీర్చేందుకు నగదు ఇస్తున్నారు. బ్యాంకు నుంచి పంట రుణం పొందిన మరుక్షణమే వసూలు చేసుకుంటున్నారు. వసూలు చేస్తున్న నెల వడ్డీలో బ్యాంకు అధికారులకు కూడా వాటాలు ఇస్తున్నట్లు సమాచారం.

బలవంతంగా 7 శాతం వడ్డీ వసూలు

నిబంధనల ప్రకారం పంట రుణాలకు వడ్డీ 7 శాతం ఉంటుంది. రైతులు పంట రుణాలను గడువులోపు చెల్లిస్తే కేంద్ర ప్రభుత్వం 3 శాతం ప్రోత్సాహం(ఇంటెన్సివ్) ఇస్తుంది. గడువులోపు చెల్లిస్తే బ్యాంకర్లు కేవలం 4 శాతం వడ్డీ మాత్రమే వసూలు చేయాల్సి ఉంటుంది. కానీ 7 శాతం, ఇంకా అంతకంటే ఎక్కువ వసూలు చేస్తుండటం గమనార్హం. సకాలంలో పంట రుణాలు చెల్లించిన వారికి 3 శాతం ఇంటెన్సివ్ వచ్చేందుకు కేంద్ర ప్రభుత్వం ముందుగానే బడ్జెట్ కేటాయిస్తుంది. కానీ రైతుల నుంచి బలవంతంగా 7 శాతం వడ్డీ వసూలు చేస్తుండటం గమనార్హం. సకాలంలో రుణాలు చెల్లించిన వారికి 3 శాతం ఇంటెన్సివ్ వెనక్కి ఇస్తున్నారా అంటే అదీ లేకుండాపోయింది.

అప్పులు తెచ్చి కట్టాల్సిందే..



గత ఏడాది ఖరీఫ్‌లో కర్నూలులోని పంజాబ్ నేషనల్ బ్యాంకులో రూ.8లక్షల వరకు పంట రుణం తీసుకున్నా. పత్తి, కంది, ఉల్లిగడ్డలు తదితర పంటలు సాగు చేస్తున్నాం. ప్రస్తుతం క్రాప్‌లోన్ రెన్యువల్ చేసుకుందామని బ్యాంకుకు పోతే అసలు, వడ్డీ మొత్తం చెల్లించాలంటున్నారు. ఇంత మొత్తం కట్టాలంటే అప్పు చేయక తప్పదు. ప్రభుత్వం రైతులను ఆదుకోకపోతే వ్యవసాయం చేయలేం.

– పరమేశ్వరరెడ్డి, రేమడూరు, కల్లూరు మండలం

అసలు, వడ్డీ చెల్లించాల్సిందే..



గత ఏడాది బ్యాంకుల నుంచి తీసుకున్న పంట రుణాలు, బంగారంపై పొందిన వ్యవసాయ రుణాలు రెన్యూవల్ చేసుకోవాలంటే అసలు, వడ్డీ చెల్లించాల్సిందే. అప్పు మొత్తం క్లియర్ అయిన తర్వాతనే కొత్తగా పంట రుణం ఇస్తారు. ఈ నిర్ణయాన్ని పునరాలోచించాలని ఆర్‌బీఐని ఎస్‌ఎల్‌బీసీ కోరుతోంది. కొన్ని బ్యాంకులు కేవలం వడ్డీ కట్టించుకొని రెన్యూవల్ చేస్తున్నాయి.

– రామచంద్రరావు, ఎల్‌డీఎం, కర్నూలు

కొంత బ్యాంకులో డిపాజిట్ చేయాల్సిందే..

కొందరు బ్యాంకర్లు డిపాజిట్‌లను పెంచుకోవడానికి జిమ్మిక్కులకు పాల్పడుతున్నారు. పంట రుణం ఇచ్చినట్లే ఇచ్చి వెంటనే అందులో 25 నుంచి 50 శాతం మొత్తాన్ని డిపాజిట్ చేయిస్తున్నారు. పంటల సాగుకు పెట్టుబడుల కోసం రుణం తీసుకుంటే అందులో కొంత డిపాజిట్ చేయిస్తుండటంతో రైతులు మళ్లీ అప్పులు చేయాల్సిన పరిస్థితి నెలకొంటోంది. రూ.లక్ష పంట రుణం మంజూరు చేస్తే రైతుకు రూ.60 వేలు ఇచ్చి రూ.40 వేలు డిపాజిట్ చేసుకుంటున్నారు. రూ.50 వేలు మంజూరు చేస్తే రూ.20వేలు డిపాజిట్ చేసుకుంటున్నట్లు తెలుస్తోంది. ఈ పరిస్థితి ప్రధానంగా ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంకులో ఉన్నట్లు స్పష్టమవుతోంది.

నల్లమలలో 'అవినీతి' అనకొండ

ఆత్మకూరు అటవీ కార్యాలయంలో ఫెవికాల్ ఉద్యోగి అక్రమాలు

- పదవీ విరమణతో అవినీతి వెలుగులోకి
- రూ.6 కోట్ల ప్రభుత్వ నిధులు దారి మళ్లింపు





రిటైర్డ్ ఉద్యోగి చాంద్‌బాషా

ఆత్మకూరు రూరల్: ఆత్మకూరు అటవీ శాఖ కార్యాలయంలో 15 ఏళ్లుగా పని చేస్తూ ఐదు నెలల క్రితం పదవీ విరమణ పొందిన ఉద్యోగి అవినీతి బాగోతం చూస్తే కళ్లు బైర్లు కమ్మాల్సిందే. ఏకంగా రూ.6కోట్ల నిధులను మళ్లించిన బాగోతం ఇప్పుడు ఆ శాఖను కుదిపేస్తోంది. నాగార్జున సాగర్ – శ్రీశైలం పెద్దపులుల అభయారణ్యంలోని ఆత్మకూరు అటవీ డివిజన్ డిప్యూటీ డైరెక్టర్ కార్యాలయంలో అకౌంట్స్ సూపరింటెండెంట్‌గా పని చేసిన చాంద్ బాషా గతేడాది డిసెంబర్‌లో పదవీ విరమణ పొందారు. ఆ తర్వాత రికార్డులు పరిశీలించిన సిబ్బందికి మొదట రూ.20 లక్షలు దారి మళ్లించినట్లు గుర్తించి దర్యాప్తు చేపట్టగా తవ్వే కొద్దీ అక్రమాలు వెలుగు చూస్తున్నాయి. బైర్లూటీలోని ఎన్విరాన్‌మెంటల్ మెయింటెనెన్స్ చెక్ పోస్టు నుంచి వసూలైన మొత్తం సర్కిల్ కార్యాలయానికి జమ చేయకుండా ప్రైవేటు వ్యక్తుల ఖాతాలకు మళ్లించినట్లు గుర్తించారు. ఈ విషయమై చాంద్ బాషాపై స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో ఆయన అజ్ఞాతంలోకి వెళ్లాడు. ఈ క్రమంలో అధికార పార్టీకి చెందిన ప్రముఖులు పోలీసులతో మధ్యవర్తిత్వం చేసి అరెస్టును వాయిదా వేయించినట్లు సమాచారం. ఈ మధ్య కాలంలో దారి మళ్లిందనుకున్న రూ.20 లక్షలు ఆత్మకూరు ఎఫ్‌టీ డీడీ ఖాతాలో తిరిగి జమ చేశారు. ఆపై ముందస్తు బెయిల్ ప్రయత్నాల్లో చాంద్‌బాషా ఉన్నట్లు తెలుస్తోంది. కాగా గత ఐదేళ్లలో అతని అక్రమాలు పరిశీలిస్తే దాదాపు రూ.6 కోట్లు దారి మళ్లించినట్లు విశ్వసనీయ సమాచారం. ఆత్మకూరు అటవీ డివిజన్ డిప్యూటీ డైరెక్టర్‌కు చెందిన యూనియన్ బ్యాంకు ఖాతా, నాగార్జున సాగర్ – శ్రీశైలం పెద్దపులుల అభయారణ్యం ఫీల్డ్ డైరెక్టర్‌కు చెందిన నంద్యాల ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకు ఖాతాలు పరిశీలిస్తే గత ఐదేళ్లుగా పెద్ద మొత్తంలో ప్రభుత్వ ధనం ప్రయివేట్ వ్యక్తుల బ్యాంకు ఖాతాలకు బదిలీ చేసినట్లు వెలుగు చూసింది. అటవీశాఖకు చెందిన వివిధ ఆదాయ మార్గాల ద్వారా వచ్చిన నగదు మొత్తాలను చాంద్‌బాషా తెలివిగా తన సమీప బంధువులు, నమ్మకస్తుల ఖాతాలకు బదిలీ చేసినట్లు తెలుస్తోంది. ఆత్మకూరు పట్టణంలోని పాత బస్టాండ్ సమీపంలో ఉండే మహేశ్వర ప్రింటింగ్ ప్రెస్ యజమాని శివయ్య, అతని కుటుంబ సభ్యుల బ్యాంకు ఖాతాలకు ఏకంగా సుమారు రూ.3 కోట్లకు పైగా నగదు బదిలీ చర్చనీయాంశంగా మారింది.

కెమెరాల కొనుగోల్‌మాల్

నల్లమల అభయారణ్యంలో జంతువుల లెక్కింపు, వేటగాళ్ల కదలికలను పసిగట్టేందుకు ఏర్పాటు చేసే ఇన్‌ఫ్రారెడ్ కెమెరాలా కొనుగోళ్లలోను అక్రమాలకు పాల్పడినట్లు తెలుస్తోంది. హైదరాబాద్‌కు చెందిన గ్లోబల్ టెలీ కమ్యూనికేషన్ సంస్థకు అటవీశాఖ ద్వారా ఇన్‌ఫ్రారెడ్ కెమెరాలు కొనుగోలుకు ఇండెంట్ పెట్టారు. అయితే అటవీ శాఖ అనకొండ కన్ను దీనిపై కూడా పడడంతో ఆ సంస్థకు కొంత కమీషన్ ఇచ్చి కెమెరాలు కొనుగోలు చేసినట్లు బిల్లులు సృష్టించి నిధులు స్వాహా చేసినట్లు తెలుస్తోంది. ఈ క్రమంలో ఆత్మకూరు అటవీ డివిజన్ డిప్యూటీ డైరెక్టర్ సహాయ కన్జర్వేటర్ సాయిబాబా అటవీ దళాల ప్రధానాధికారి పీసీసీఎఫ్ ఏకే నాయక్‌కు సమగ్ర నివేదికను పంపారు. ఈ మేరకు ఆయన ఐదుగురితో కూడిన ఒక దర్యాప్తు కమిటీని నియమించారు.

సమగ్ర నివేదిక అందజేశాం



ఆత్మకూరు అటవీడివిజన్ ప్రధాన కార్యాలయంలో అకౌంట్స్ సూపరింటెండెంట్‌గా పని చేసి ఇటీవల ఉద్యోగ విరమణ చేసిన చాంద్‌బాషా అక్రమాలపై అటవీశాఖ ప్రధాన కార్యాలయానికి సమగ్ర నివేదికను అందజేశాం. ప్రభుత్వ సొమ్మును తన సొంత ఖాతాకు మళ్లించడంతో ఆత్మకూరు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదైంది. అక్రమాలు రూ. కోట్లలో ఉండటంతో ఐదుగురి సభ్యులతో విచారణ కమిటీ దర్యాప్తు చేపడుతోంది.

– వి.సాయిబాబా, ప్రాజెక్ట్ టైగర్ డిప్యూటీ డైరెక్టర్, ఆత్మకూరు

చంద్రబాబు మాటలన్నీ అబద్ధాలే!

- రాయలసీమలో ఒక్క సాగుప్రాజెక్టును నిర్మించలేదు
- గోరుకల్లును నిర్వీర్యం చేశారు
- ఆయన పర్యటనతో జిల్లాకు ఒరిగిందేమిటి?
- వైఎస్సార్‌సీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు కాటసాని రాంభూపాల్ రెడ్డి



కర్నూలు(సెంట్రల్): రాయలసీమలోని తాగునీటి ప్రాజెక్టులన్నీ టీడీపీ చేపట్టినవేనని సీఎం చంద్రబాబునాయుడు అబద్ధాలు ఆడుతున్నారని, ఆయన హయాంలో ఒక్క ప్రాజెక్టును నిర్మించలేదని వైఎస్సార్‌సీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు కాటసాని రాంభూపాల్‌రెడ్డి అన్నారు. దివంగత నేత వైఎస్ రాజశేఖరరెడ్డి చలువతో రాయలసీమలో చాలా ప్రాజెక్టులు ఏర్పాటయ్యాయని పేర్కొన్నారు. కల్లూరులోని తన నివాసంలో శనివారం కాటసాని విలేకరులతో మాట్లాడారు. గోరుకల్లు రిజర్వాయర్‌కు ప్రధానమంత్రి ఉన్న సమయంలో పీవీ నరసింహారావు భూమి పూజ చేశారని తెలిపారు. 1994 ముందే కోట్ల విజయభాస్కరరెడ్డి ముఖ్యమంత్రి ఉన్న సమయంలో కాలువలను పూర్తి చేశారన్నారు. 1994 నుంచి 2004 వరకు చంద్రబాబు అధికారంలో ఉన్నా నీళ్లు ఇవ్వకుండా నిర్లక్ష్యం చేశారన్నారు. 2004లో సీఎంగా వచ్చిన వైఎస్ రాజశేఖరరెడ్డి గోరుకల్లు రిజర్వాయర్‌తో ప్రజలకు నీళ్లు ఇచ్చారన్నారు.

హాస్యాస్పదం

ఎస్ఆర్‌బీసీ, హంద్రీనీవా ప్రాజెక్టులను టీడీపీ హయాంలో చేపట్టినట్లు సీఎం చంద్రబాబునాయుడు చెప్పడం హాస్యాస్పదమని కాటసాని అన్నారు. ఈ రెండు ప్రాజెక్టుల నిర్మాణం వైఎస్సార్ హయాంలోనే జరిగిన విషయం అందరికీ తెలిసిందేనన్నారు. కర్నూలు పర్యటనకు సీఎం చంద్రబాబు ఎందుకు వచ్చినట్లో అర్థం కావడం లేదన్నారు. స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర కార్యక్రమంలో పరిసరాలను పరిశుభ్రం చేయడానికి ఎక్కడి నుంచైనా సందేశం ఇస్తే సరిపోతుందన్నారు. అయితే ఆయన మాత్రం ఆ పనిమీదనే జిల్లా పర్యటనకు వచ్చారని, ఆయన రాకతో రాష్ట్ర ప్రభుత్వానికి ఎంతో ఖర్చు వచ్చిందన్నారు. ఎక్కడైనా ముఖ్యమంత్రి పర్యటిస్తే ఆ జిల్లాకు ఏదైనా ప్రాజెక్టు లేదా ఏదైనా సంక్షేమ పథకాన్ని అమలు చేయడానికి వస్తారన్నారు. చంద్రబాబు మాత్రం రైతు బజార్‌ను శుభ్రం చేయడానికి రావడం ఎంత వరకు సబబు అని ప్రశ్నించారు. కేవలం ప్రచార ఆర్భాటం కోసమే చంద్రబాబునాయుడు జిల్లాల్లో పర్యటిస్తున్నారని, సంక్షేమ పథకాలను ఎవరూ అడగకూడదని ఆగస్టు, జూన్ అంటూ చెప్పుకుంటూ ప్రజలను మోసం చేస్తున్నారని విమర్శించారు.



మద్దికెర మండలం పెరవలిలో రోడ్డుపై పారుతున్న వర్షపు నీరు



కోడుమూరు ఎస్సీ కాలనీలో నేలకూలిన కరెంట్ స్తంభం

కర్నూలులో భారీ వర్షం



కర్నూలులో ఏకధాటిగా కురుస్తున్న వర్షం

కర్నూలు(అగ్రికల్చర్): కర్నూలులో శనివారం సాయంత్రం రెండు గంటల పాటు ఉరుములు, మెరుపులతో భారీ వర్షం కురిసింది. నగరంలో 46.5 మి.మీ వర్షపాతం నమోదైంది. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఎండల తీవ్రత లేకపోయినా ఉక్కపోత ఉక్కిరిబిక్కిరి చేసింది. సాయంత్రం నుంచి భారీ వర్షం పడటంతో వాతావరణం చల్లబడింది. ఉరుముల తీవ్రతకు చిన్నపిల్లలు భయభ్రాంతులకు లోనయ్యారు. ఆనంద్ సినీ కాంప్లెక్స్, కేసీ కెనాల్, రైల్వే బ్రిడ్జి కిందకు భారీగా వర్షం నీరు చేరడంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. ఆర్టీసీ బస్సులను చౌరస్తా మీదుగా బైపాస్‌కు మళ్లించడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు.

14 మండలాల్లో అకాల వర్షాలు

ఉరుములు, మెరుపులు.. గాలులతో అకాల వర్షాలు కురుస్తున్నాయి. శుక్రవారం రాత్రి నుంచి శనివారం ఉదయం వరకు 14 మండలాల్లో తేలికపాటి నుంచి ఒక మోస్తరు వర్షాలు కురిశాయి. తుగ్గలిలో భారీ వర్షం కురిసింది. తుగ్గలిలో 45.2 మి.మీ., కోడుమూరులో 33.6, పత్తికొండలో 21.4, పెద్దకడుబూరులో 15.4, గోనెగండ్లలో 14.8, కోసిగిలో 9.2 మి.మీ వర్షపాతం నమోదైంది. గాలుల తీవ్రత ఎక్కువగా ఉండటంతో మామిడి తోటలకు నష్టం కలిగింది. రానున్న రెండు రోజుల్లో వివిధ ప్రాంతాల్లో వర్షాలు కురిసే అవకాశం ఉన్నట్లు వాతావరణ శాఖ అధికారులు ప్రకటించారు.

క్లుప్తంగా

ఫొటో, వీడియోగ్రఫీలో ఉచిత శిక్షణ

కర్నూలు(అగ్రికల్చర్): ఉమ్మడి కర్నూలు జిల్లాలోని గ్రామీణ ప్రాంత యువకులకు కెనరా బ్యాంక్ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ ఫొటోగ్రఫీ, వీడియోగ్రఫీలో ఉచిత శిక్షణ ఇస్తున్నట్లు సంస్థ డైరెక్టర్ కె.పుష్పక్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. జూన్ 10వ తేదీ నుంచి శిక్షణ మొదలవుతుందని, 18 నుంచి 45 ఏళ్లలోపు వయస్సు 10వ తరగతి పాసైన యువకులు అర్హులన్నారు. శిక్షణా కాలంలో ఉచిత భోజనం, హాస్టల్ వసతి కల్పిస్తామన్నారు. ఆసక్తి కలిగిన యువకులు బి.తాండ్రపాడు సమీపంలోని కెనరా బ్యాంకు–గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణా సంస్థ(డీఆర్‌డీఏ–టీటీడీసీ ప్రక్కన)లో సంప్రదించవచ్చన్నారు. మరిన్ని వివరాలకు 63044 91236 నంబర్‌కు ఫోన్ చేయవచ్చని పేర్కొన్నారు.

ఈతకు వెళ్లి బాలుడి మృతి



మృతదేహాన్ని వెలికి తీస్తున్న గ్రామస్తులు

ఆత్మకూరురూరల్: వెంకటాపురం గ్రామంలో శనివారం ఓ బాలుడు ప్రమాదవశాత్తూ బావిలో మునిగి మృత్యువాత పడ్డాడు. గ్రామానికి చెందిన కుందూరు రామచంద్రారెడ్డి, లక్ష్మీదేవి దంపతుల ఏకైక కుమారుడు కుందూరు చరణ్ రెడ్డి(15) తొమ్మిదో తరగతి పూర్తి చేసి పదో తరగతికి వెళ్లాల్సి ఉంది. వేసవి సెలవులు కావడంతో స్నేహితులతో ఊరు శివారులోని వ్యవసాయ బావిలో ఈతకు వెళ్లాడు. అయితే ఈత అంతగా రాని చరణ్ రెడ్డి బావిలో దూకడంతో నేరుగా నీటిలో మునిగి బురదలో చిక్కుకున్నాడు. దీంతో ఊపిరాడక మరణించాడు. సమాచారం తెలుసుకున్న గ్రామస్తులు చరణ్ మృతదేహాన్ని వెలికి తీశారు. ఆత్మకూరు పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించి కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని పోస్టు మార్టం నిమిత్తం ఆత్మకూరు ఆసుపత్రి మార్చురీకి తరలించారు.

మహాయోగి.. మహిమాన్విత మూర్తి

- రేపు ఆదోనిలో లక్ష్మమ్మ అవ్వ జాతర
- భారీగా తరలిరానున్న భక్తులు



ప్రత్యేక అలంకరణలో లక్ష్మమ్మవ్వ మూలవిరాట్

మహాయోగిగా ప్రసిద్ధి..

ఆదోని పట్టణంలో లక్ష్మమ్మ అవ్వ మహిమలు చూపారు. మహాయోగిగా ప్రసిద్ధి చెందారు. దుకాణాల వద్దకు అవ్వ వచ్చిపోతే వ్యాపారం బాగా సాగుతుందనే నమ్మేవారు. అవ్వను కలిసి వేడుకుంటే సంతానం కలిగేదని భక్తులు చెప్పేవారు. ఆదోనిలో రాచోటి రామయ్య వంశీయులు, చాకలి నరసప్ప తదితరులు అవ్వను ఆశ్రయించి దగ్గరుండి సేవలు చేసేవారు. ఓ పెద్ద కుర్చీలో ఉంచి పల్లకీ సేవగా ఊరేగించేవారు. లక్ష్మమ్మ అవ్వ 1933లో జీవసమాధి అయ్యారు. అక్కడే రాచోటి రామయ్య వంశీకులు గుడి కట్టించారు. లక్ష్మమ్మ అవ్వ గుడిలో జీవసమాధి వద్ద ధ్యానం చేసిన వారికి మంచి జరిగేదని నిర్వాహకులు తెలిపారు.



ఆలయ గర్భగుడికి బంగారు తొడుగు ఏర్పాటు చేసిన దృశ్యం

ఆదోని అర్బన్: మహిమలు చూపిన మాతృమూర్తి మహాయోగి లక్ష్మమ్మ అవ్వ. ఆదోని పట్టణంలో సోమవారం అవ్వ జాతర నిర్వహించనున్నారు. ఇరు తెలుగు రాష్ట్రాలతో పాటు కర్ణాటక నుంచి భారీగా భక్తులు తరలిరానున్నారు.

దళితుల ఇంట పుట్టి....

లక్ష్మమ్మ అవ్వ ఆలూరు మండలం మూసానహళ్లి గ్రామంలో దళితులు మంగమ్మ, బండెప్ప దంపతులకు జన్మించారు. చిన్నప్పటి నుంచే మౌనంగా ఉండడంతో గ్రామస్తులు తిక్కమ్మగా పిలిచేవారు. లక్ష్మమ్మ అవ్వను కర్ణాటక రాష్ట్రం సిరుగుప్ప గ్రామానికి చెందిన యువకుడు మారెప్పకు ఇచ్చి తల్లిదండ్రులు వివాహం చేశారు. ఒక రోజు లక్ష్మమ్మ అవ్వ శక్తిస్వరూపిణిగా భర్తకు కనిపించడంతో ఆయన భయపడి ఇంట్లో నుంచి బయటకు పరుగులు తీశాడు. దీంతో సిరుగుప్ప నుంచి అవ్వ ఆదోనికి చేరుకుని తన మహిమలు చూపారు.

రేపు రథోత్సవం

లక్ష్మమ్మ అవ్వ జాతర సందర్భంగా సోమవారం మధ్యాహ్నం 3 గంటల నుంచి ఆదోని పట్టణంలో వెండి రథోత్సవం నిర్వహించనున్నారు. అమ్మవారిని కొలువుదీర్చే మండపాన్ని, ఆలయ సమీపంలోని విద్యుత్ దీపాలతో అలంకరించారు. ఆలయ వంశపారంపర్య ధర్మకర్త రాచోటి రామయ్య చేయించిన బంగారు కిరీటాన్ని సోమవారం సమర్పించనున్నారు. జాతర సందర్భంగా ప్రజా సంఘాల ఆధ్వర్యంలో అన్నదానం చేయనున్నారు. డీఎస్పీ హేమలత ఆధ్వర్యంలో పోలీస్ బందోబస్తును నిర్వహిస్తున్నారు.



వెండి రథం

భక్తులకు అన్ని సౌకర్యాలు



భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నాం. భగవాన్ మహాయోగి లక్ష్మమ్మవ్వ ఎడ్యుకేషన్ సొసైటీ ఆధ్వర్యంలో యోగా సాధన, ధ్యానం, సంగీతం తదితర కార్యక్రమాలు నిర్వహిస్తారు. జాతరలో నూతన వధూవరులు అవ్వవారిని దర్శించుకుంటారు.

– రాచోటి రామయ్య, ఆలయ ధర్మకర్త

మద్దిలేటయ్య.. కిటకిట!



భక్త జనంతో కిక్కిరిసిన మద్దిలేటి నరసింహస్వామి క్షేత్రం

బేతంచెర్ల: ప్రముఖ వైష్ణవ పుణ్యక్షేత్రమైన శ్రీ మద్దిలేటి నరసింహస్వామి ఆలయం శనివారం భక్తజనంతో కిక్కిరిసిపోయింది. వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులు ఆలయ పుష్కరిణిలో పుణ్యస్నానాలు ఆచరించి దర్శనానికి బారులుదీరారు. స్వామి, అమ్మవార్లకు పంచామృతాభిషేకం, కుంమార్చన, ఆకుపూజ, స్వామి వారికి ప్రీతి పాత్రమైన వరపూజతో పాటు మహా మంగళహారతి నిర్వహించారు. గోవింద నామస్మరణలతో ఆలయ ఆవరణం మారు మోగింది.

అసంతృప్తి.. అలక!



బైరెడ్డి అనుచరులపై చిందులేస్తున్న మల్లెల రాజశేఖర్

ఓర్వకల్లు: కూటమి ప్రభుత్వంలో ఎమ్మెల్యేలకు మాత్రమే ప్రాధాన్యత లభిస్తోందనేందుకు సీఎం చంద్రబాబు పర్యటన అద్దం పట్టింది. ద్వితీయ శ్రేణి నాయకులు, కార్యకర్తలు కనీసం కలిసేందుకు కూడా వీలుపడటం లేదని స్వయంగా నాయకులే అసంతృప్తి వ్యక్తం చేయడం గమనార్హం. శనివారం రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు జిల్లా పర్యటనకు విచ్చేశారు. నిర్దేశించిన సమయం కంటే గంట ఆలస్యంగా ఓర్వకల్లు ఎయిర్‌పోర్టుకు చేరుకున్నారు. దీంతో ద్వితీయ శ్రేణి నాయకులు, అధికారులు, కిందస్థాయి కార్యకర్తలు మండుటెండలో పడిగాపులు కాయాల్సి వచ్చింది. ఈ సందర్భంగా టెర్మినల్ బిల్డింగ్ వద్ద లోపలికి వెళ్లేందుకు ఎంపీలు, ఎమ్మెల్యేలకు మాత్రమే అనుమతించారు. నంద్యాల ఎంపీ బైరెడ్డి శబరి తమ అనుచరులను లోపలికి అనుమతించాలని కోరగా, అందుకు పోలీసులు నిరాకరించారు. దీంతో అధికారులు తయారు చేసిన ప్రొటోకాల్‌పై ఆమె అసంతృప్తి వ్యక్తం చేశారు. పక్కనే ఉన్న టీటీడీ పాలకమండలి సభ్యుడు మల్లెల రాజశేఖర్ ఆమెకు సర్దిచెప్పే ప్రయత్నంలో బైరెడ్డి వర్గీయులపై చిందులేయడం చర్చనీయాంశంగా మారింది. ఇదే సమయంలో తన అనుచరులను లోనికి అనుమతించకపోవడంతో శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్‌రెడ్డి కూడా అక్కడి నుంచి వెనుదిరిగారు. ఈ రెండు ఘటనలతో చంద్రబాబు ను కలిసేందుకు వచ్చిన ద్వితీయ శ్రేణి నాయకులు, కార్యకర్తలు నాయకులకే దిక్కులేకుంటే తమ పరిస్థితి ఏమిటని చర్చించుకోవడం కనిపించింది.

వినతిపత్రాలు ఇచ్చేందుకు వెళ్తే అరెస్టులు



సీపీఐ నాయకులను అరెస్టు చేసి పోలీసుస్టేషన్‌కు తరలిస్తున్న దృశ్యం

కల్లూరు: సూపర్‌సిక్స్ పథకాలను అమలు చేయాలని కోరుతూ సీఎం చంద్రబాబునాయుడుకు వినతిపత్రం ఇచ్చేందుకు వచ్చిన సీపీఐ, కాంగ్రెస్ నాయకులను పోలీసులు అరెస్టు చేశారు. శనివారం సీఎం పర్యటనలో భాగంగా ఏర్పాటు చేసిన ప్రజా వేదిక వద్దకు సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి మునెప్ప నేతృత్వంలో శ్రీనివాసరావు, మహేష్, బాబయ్య, అశోక్, రాముడు, అలాగే నంద్యాల డీసీసీ అధ్యక్షుడు జే.లక్ష్మీనరసింహ, కర్నూలు నగర కాంగ్రెస్ అధ్యక్షుడు జిలానీ బాషా చేరుకున్నారు. వీరిని పోలీసులు అత్యుత్సాహంతో అదుపులోకి తీసుకున్నారు. వినతిపత్రం ఇచ్చేందుకు సీఎంను కలిసే ఏర్పాటు చేస్తామని చెప్పి ఉలిందకొండ పోలీసు స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రజాస్వామ్యబద్ధంగా సీఎంకు వినతి పత్రం ఇచ్చేందుకు వెళ్తే అరెస్టు చేయడం భావ్యం కాదన్నారు. పోలీసులే ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తుండటం విడ్డూరంగా ఉందన్నారు. అక్రమ అరెస్టును సీపీఐ జిల్లా కార్యదర్శి బి.గిడ్డయ్య ఖండించారు.

తల్లిదండ్రుల చెంతకు చేరిన బాలుడు



తల్లితండ్రుల చెంతకు చేరిన అభిరామ్

వెల్దుర్తి: పట్టణంలోని 9వ వార్డు ముల్ల గేరిలో నివాసముంటున్న మూడేళ్ల బాలుడు అభిరామ్ శనివారం మధ్యాహ్నం తప్పిపోయి కొన్ని గంటల్లోనే తల్లితండ్రులు పరుశరాముడు, లుధియాల చెంత చేరాడు. వివరాలు.. అభిరామ్ తన ఇంటి ముందు ఆడుకుంటూ బంధువుల యువకుడితో కలిసి అరకిలోమీటర్ దూరంలోని పోలీస్‌స్టేషన్ సమీప దుకాణానికి వెళ్లాడు. ఆ యువకుడు వెళ్లిపోవడంతో అభిరామ్ ఒక్కడై డోన్ వైపు దారి వెంట ఏడ్చుకుంటూ తిరిగాడు. అక్కడున్న వారు బాలుడ్ని చేరదీసి పోలీస్‌స్టేషన్‌ను సంప్రదించారు. ఎస్‌ఐ అశోక్ సలహా మేరకు బాలుడి ఫొటోను వాట్సాప్‌లో ఉంచగా తల్లితండ్రులకు సమాచారం అందింది. వెంటనే వారు పోలీస్‌స్టేషన్ చేరుకుని పిల్లవాడ్ని ముద్దాడుతూ ఊపిరి పీల్చుకున్నారు.

‘విశ్వ’మంత సంబరం

- నందడిగా జేఎన్‌టీయూ(ఏ) 14వ స్నాతకోత్సవం



గవర్నర్ జస్టిస్ ఎస్. అబ్దుల్ నజీర్ నుంచి పట్టా అందుకుంటున్న నంద్యాల పూజిత కుమార్‌రెడ్డి



కుటుంబీకులతో సెల్ఫీలు తీసుకుంటూ

అనంతపురం: రాయలసీమకే తలమానికంగా నిలిచిన అనంతపురం జవహర్‌లాల్ నెహ్రూ విశ్వవిద్యాలయ (ఏ) 14వ స్నాతకోత్సవ సంబరం అంబరమంటింది. జేఎన్‌టీయూ ఆడిటోరియంలో శనివారం నిర్వహించిన స్నాతకోత్సవానికి చాన్స్‌లర్ హోదాలో గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్ హాజరయ్యారు. గౌరవ డాక్టరేట్ గ్రహీత డాక్టర్ చావా సత్యనారాయణ, వీసీ ప్రొఫెసర్ హెచ్. సుదర్శనరావు, ముఖ్య అతిథి, కాన్పూర్ ఐఐటీ ఎమిరటర్స్ ప్రొఫెసర్ డాక్టర్ ఎం.ఆర్. మాధవ్, పాలక మండలి సభ్యులు, డీన్లు వేదికపై ఆశీనులయ్యారు. చాన్స్‌లర్ హోదాలో ఏపీ గవర్నర్ జస్టిస్ ఎస్.అబ్దుల్ నజీర్ ప్రసంగించారు. గవర్నర్ ప్రసంగం ఆద్యంతం విద్యార్థులు చప్పట్లతో హోరెత్తించారు. తన ప్రసంగం ప్రారంభంలో జేఎన్‌టీయూ విద్యార్థులు బంగారు బిడ్డలు అంటూ గవర్నర్ అనడం ఆకట్టుకుంది. గౌరవ డాక్టరేట్ డాక్టర్ చావా సత్యనారాయణకి ప్రదానం చేయడం ద్వారా జేఎన్‌టీయూ కీర్తికిరీటంలో మరో కలికితురాయి చేరింది. స్నాతకోత్సవాన్ని పురస్కరించుకుని పీజీ, పీహెచ్‌డీ, డిగ్రీ పూర్తి చేసిన విద్యార్థులకు పట్టాలు ప్రదానం చేశారు. మొత్తం 41 బంగారు పతకాలు ఇవ్వగా, 27 బంగారు పతకాలు అమ్మాయిలే సాధించడం గమనార్హం. ఆరు పతకాలు దక్కించుకున్న విద్యార్థి నంద్యాల పూజిత్ కుమార్ రెడ్డిని ఉద్దేశించి.. బంగారు పతకాలు చాలా బరువుగా ఉన్నాయంటూ గవర్నర్ సరదాగా వ్యాఖ్యానించారు. జేఎన్‌టీయూ (ఏ) వీసీ ప్రొఫెసర్ హెచ్. సుదర్శనరావు స్నాతకోత్సవాన్ని ఉద్దేశించి ప్రసంగించారు. ‘ద టైమ్స్ ఇండియా వరల్డ్’ ర్యాంకింగ్‌లో వర్సిటీ 801–1000 ర్యాంకు దక్కించుకుందన్నారు. క్వాంటమ్ కంప్యూటింగ్ కోర్సుల్లో మైనర్ డిగ్రీని ప్రవేశపెట్టామని, అపార్ అనుసంధానంతో అకడమిక్ బ్యాంక్ ఆఫ్ క్రెడిట్‌ను ఏర్పాటు చేశామన్నారు. ‘రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్’లో వర్సిటీ భాగస్వామి కావడం గర్వకారణమన్నారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఎస్. కృష్ణయ్య, పాలకమండలి సభ్యులు పాల్గొన్నారు.

పట్ట పగలే ఆలయంలో చోరీ

- వెండి కిరీటం అపహరణ

నందవరం: పట్టపగలే దొంగలు చోరీకి పాల్పడ్డారు. ఇందుకు నందవరం కోటావీధిలోని వీరభద్ర స్వామి దేవాలయాన్ని ఎంచుకున్నారు. స్వామి వెండి కిరీటాన్ని అపహరించారు. ఆలయ కమిటీ సభ్యులు తెలిపిన వివరాలు మేరకు.. వీరభద్ర స్వామికి 75 తులాల వెండి కిరీటం, 70 తులాల వెండి ఆభరణాలు చేయించారు. శనివారం మధ్యాహ్న సమయంలో గుర్తుతెలియని వ్యక్తులు ఆలయం గర్భగుడిలోకి ప్రవేశించారు. రూ.80 వేలు విలువ చేసే స్వామి వారికి వెండి కిరీటాన్ని తస్కరించారు. ఆభరణాలు చోరీ చేయాలని చూడగా రాకపోవడంతో వదిలేసి వెళ్లారు. గర్భగుడి ఆలయం తాళాలు ప్రతి రోజు దేవాలయంలోనే భద్ర పరిచేవారని, గమనించిన వ్యక్తులే చోరీ చేసి ఉండవచ్చని అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. పోలీసులకు ఫిర్యాదు చేస్తామని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

పెళ్లి చేసుకోవాలని యువతిపై దాడి

- యువతి కుటుంబ సభ్యులకు గాయాలు

ఎమ్మిగనూరురూరల్: పెళ్లి చేసుకోవాలని ఒక యువతిపై శనివారం యువకుడు, అతని కుటుంబ సభ్యులు దాడి చేశారు. ఈ ఘటన గుడేకల్ గ్రామంలో చోటుచేసుకోగా.. యువతితో పాటు ఆమె కుటుంబ సభ్యులకు గాయాలు అయ్యాయి. వివరాలు.. గ్రామానికి చెందిన దావీదు చిన్న కుమార్తె నరసమ్మను అదే కాలనీకి చెందిన చిన్న నల్లన్న అనే యువకుడు కొన్ని నెలల నుంచి ప్రేమ పేరుతో వేధిస్తున్నాడు. తల్లిదండ్రులు యువతికి పెళ్లి సంబంధాలు చూస్తున్నా నల్లన్న చెడుగొడుతున్నాడు. ఇదే విషయంపై యువతి కుటుంబ సభ్యులు నల్లన్న ఇంటికి శుక్రవారం రాత్రి వెళ్లి హెచ్చరికలు జారీ చేశారు. శనివారం చిన్న నరసన్న తన బంధువులతో కలసి యువతి ఇంటికి వచ్చాడు. కర్రలతో యువతితో పాటు ఆమె అక్క శాంతి, తండ్రి దావీదులపై దాడి చేశారు. గాయపడ్డ వారిని చికిత్స కోసం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. యువతి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు రూరల్ పోలీసులు తెలిపారు.



కష్టాన్ని మ‘రుచి’

వారంతా రెక్కల కష్టంతో బతికేవారు. వెల్దుర్తి మండలం అలుగుండు గ్రామం నుంచి కల్లూరు మండలం చిన్నటేకూరు గ్రామానికి పూలు తెంచడానికి వచ్చారు. ఉదయం నుంచి తోటలో పనిచేసి మధ్యాహ్నం వేళ అందరూ ఇలా కలిశారు. ఇంటి నుంచి తెచ్చుకున్న భోజనాన్ని పంచుకుని తిన్నారు. ఒకరి కష్టంలో ఒకరు తోడుగా ఉండడం సంగతి ఏమో.. కనీసం కలసి మాట్లాడుకోవడం లేని పరిస్థితులు నేడు నెలకొన్నాయి. వ్యవసాయ పనులు చేసే వీరిని చూసి అందరూ ఆదర్శంగా తీసుకోవాల్సి ఉంది. – కల్లూరు